క్లుప్తంగా

వైభవంగా మదన గోపాలుని కల్యాణం


స్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత మదన గోపాల స్వామి కల్యాణోత్సవం సోమవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. టెంపుల్స్ సెంటర్లోని స్వామి వారి ఆలయంలో ఉదయం అభిషేక పూజలు నిర్వహించి అనంతరం దేవేరులతో సహా స్వామి వారిని వధూవరులుగా అలంకరించారు. పసుపు కొట్టే కార్యక్రమాన్ని మహిళా భక్తులు ప్రారంభించి పారాయణలు చేపట్టారు. సాయంత్రం నుంచి ఎదుర్కోలోత్సవం అనంతరం దేవతామూర్తులకు కల్యాణోత్సవం నిర్వహించారు. ఐదు రోజులపాటు స్వామివారి ఉత్సవాలు కొనసాగనున్నాయి. వైఖాన ఆగమ పండితులు శ్రీమాన్ శ్రీనివాసుల శేషాచార్యులు, లక్ష్మీనారాయణ పార్థసారథి, ఆలయ ప్రధాన అర్చకులు గుడిపూడి వెంకట రామా శేషాచార్యులు ఆధ్వర్యంలో పూజాది అభిషేక ఉత్సవ కార్యక్రమాలు నిర్వహించారు.

చెస్ పోటీల్లో విద్యార్థిని ప్రతిభ


కావ్యకి సర్టిఫికెట్ అందజేస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన విద్యార్థి రాఘవ రాజు కావ్య తృతీయ స్థానం సాధించిందని వెంకటపతి రాజు విద్యాసంస్థల కరస్పాండెంట్ ఎస్ఆర్ఆర్ సుభద్ర దేవి సోమవారం పేర్కొన్నారు. జెట్టి సత్యరావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యాన చెస్ చాంపియన్ రాష్ట్రస్థాయి పోటీలు జంగారెడ్డిగూడెంలో నిర్వహించారు. ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలకు చెందిన దాదాపు 500 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జెట్టి గురునాథరావు విద్యార్థి కావ్యకి ప్రశంసా పత్రం, షీల్డ్ బహుకరించారు. మాజీ సర్పంచ్ నరసింహారాజు, ప్రిన్సిపాల్ వై.అశోక్ కుమార్ విద్యార్థిని అభినందించారు.

చేపల అక్రమ పెంపకంపై చర్యలు తీసుకోవాలి

జంగారెడ్డిగూడెం: అక్రమంగా చేపల పెంపకాలు చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. ఈమేరకు సోమవారం ఆర్డీవో ఎంవీ రమణకు వినతిపత్రం అందజేశారు. ఆ సంఘం మండల కార్యదర్శి ఎ.ప్రభాకరరావు, మల్లెల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ మత్స్యశాఖ, జలవనరుల శాఖ అనుమతులు లేకుండా తిరుమలాపురంలో 105 ఎకరాల తామరచెరువును పంచాయతీ ఆధ్వర్యంలో దండోరా వేయించి అక్రమ పద్ధతిలో వేలం పాట జరిపారన్నారు. ఇప్పటికీ గ్రామపంచాయతీకి రావలసిన రూ.6 లక్షలు జమ చేయలేదన్నారు. నిధులు పంచాయతీకి జమ కాకపోవడంపై పంచాయితీ కార్యదర్శి, సిబ్బందిపై దర్యాప్తు జరపాలన్నారు. అలాగే చెరువులో వ్యర్థాలు వేసి నీళ్లను కలుషితం చేసినందుకు చెరువు నీళ్లను వెంటనే ల్యాబ్ కు పంపించి టెస్ట్ చేయించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఏడాది కూడా అక్రమ పద్ధతిలో వేలం పాట నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని, అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు.

పురుగుమందుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

కుక్కునూరు: స్థానిక ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో సోమవారం విజిలెన్స్ తనిఖీలు నిర్వహించారు. రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఆదేశాల మేరకు రెవెన్యూ, వ్యవసాయ శాఖాధికారులు సంయుక్తంగా నిర్వహించిన తనిఖీల్లో మేస్సర్స్ సాయి పవన్ ఎంటర్‌ప్రైజెస్ నందు నిల్వలో వ్యత్యాసాలు గుర్తించి రూ.38,460 విలువ గల 3 మెట్రిక్ టన్నుల ఎరువులను సీజ్ చేశారు. మేస్సర్స్ మన రైతు సేవా కేంద్రం నందు నిల్వలో వ్యత్యాసాలు గుర్తించి రూ.63,510 విలువ గల 40 లీటర్ల ఎరువులు, మైక్రో న్యూట్రియంట్స్‌ను సీజ్ చేశారు. వీరిపై నిత్యావసర వస్తువుల చట్టం ప్రకారం కేసు నమోదు చేసినట్టు అధికారులు తెలిపారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ ఏఓ జీ మీరయ్య, విజిలెన్స్ తహసీల్దార్ బి కన్యాకుమారి, కుక్కునూరు ఇన్‌చార్జి కె గంగాధరం, వీఆర్ఓ రామకృష్ణ పాల్గొన్నారు.

మహిళా ప్రాంగణంలో నేడు జాబ్ మేళా

కామవరపుకోట: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో తడికలపూడి మహిళ ప్రాంగణం స్కిల్ హబ్ నందు మంగళవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఏలూరు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్. జితేంద్ర బాబు తెలిపారు. ఈ జాబ్ ఫెయిర్‌లో ముత్తూట్ ఫైనాన్స్, మోహన్ స్పిన్‌టెక్స్ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, పీజీ వంటి విద్యార్హతలు ఉండి 18–35 సంవత్సరాల వయసు గల వారు అర్హులని తెలియజేశారు. వివరాలకు 90008 03414, 96663 22032 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

అంగన్‌వాడీల నిరసన జ్వాల

- చలో విజయవాడ కార్యక్రమానికి వెళుతున్న అంగన్‌వాడీలు
- అడ్డుకున్న పోలీస్ యంత్రాంగం
- ప్రభుత్వ చర్యలపై నిరసన తెలిపిన అంగన్‌వాడీలు


చింతలపూడి: బోసుబొమ్మ సెంటర్‌లో అంగన్‌వాడీల రాస్తారోకో



లింగపాలెం: ధర్మాజీగూడెం పోలీస్‌స్టేషన్‌లో అంగన్‌వాడీల నిర్బంధం

చింతలపూడి: అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ జేఏసీ కమిటీల పిలుపులో భాగంగా చలో విజయవాడకు తరలివెళ్తున్న అంగ్‌వాడీలను నిర్బంధించిన ప్రభుత్వ చర్యలకు నిరసనగా సోమవారం అంగన్‌వాడీలు ఆందోళన నిర్వహించారు. స్థానిక అంగన్‌వాడీ జేఏసీ కమిటీ ఆధ్వర్యంలో ప్రజా సంఘాల కార్యాలయం వద్ద నుంచి బోసుబొమ్మ సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించారు. కూటమి ప్రభుత్వ నిర్బంధ దమన కాండను నిరసిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి తుర్లపాటి బాబు, సీపీఎం నాయకులు రామిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ గతంలో అంగన్‌వాడీల సమ్మె సందర్భంగా ప్రభుత్వానికి అంగన్‌వాడీ యూనియన్లకు మధ్య కుదిరిన ఒప్పందాన్ని నేటి వరకు అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని ఆరోపించారు. అంగన్‌వాడీలను విజయవాడ వెళ్లకుండా ఎక్కడికక్కడ పోలీసు యంత్రాంగాన్ని ప్రయోగించి అడ్డగించే ప్రయత్నం చేయడం హక్కులను హరించడమేనని విమర్శించారు. రైతు సంఘం నాయకులు ఎస్‌కె కాలేషా మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీ కోర్కెలు తీరుస్తామని రాతపూర్వక ఒప్పందాలు అమలు చేయాలని లేనిచో భవిష్యత్‌లో జరగబోయే పోరాటాలకు ప్రభుత్వమే బాధ్యత వహించవలసి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కె గురవయ్య, నాయకులు కె ధర్మారావు, హమాలీ నాయకులు శివ, చిన్నారావు, అంగన్‌వాడీ కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

అంగన్‌వాడీ మహిళల నిర్బంధం

లింగపాలెం: తమ సమస్యల పరిష్కారానికి లింగపాలెం మండలం నుంచి ఆటోలో విజయవాడ వెళుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలను ధర్మాజీగూడెం పోలీసులు అడ్డుకుని పోలీస్ స్టేషన్లో కూర్చోబెట్టారు. మధ్యాహ్నం రెండు గంటల వరకు అంగన్‌వాడీలను పోలీస్ స్టేషన్‌లో కూర్చోబెట్టారు. దీనిపై వారు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. తమ సమస్యల పరిష్కారానికి వెళుతుంటే ఈవిధంగా నిర్బంధించడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయవాడలో సమావేశానంతరం మహిళలను పోలీస్ స్టేషన్ నుంచి విడుదల చేశారు

అంగన్‌వాడీ కార్యకర్తలను అడ్డుకున్న పోలీసులు

బుట్టాయగూడెం: చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్లకుండా అంగన్‌వాడీ వర్కర్లను పోలీసులు సోమవారం ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. ఏజెన్సీ మండలాల నుంచి వెళ్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలను తడికలపూడి, ఏలూరు టోల్‌గేట్ సమీపంలో అడ్డుకుని వారిని తిరిగి వెనక్కి పంపేసారు. అయితే తమ న్యాయమైన కోర్కెలను నెరవేర్చుకునేందుకు ఏర్పాటు చేసుకున్న కార్యక్రమానికి వెళ్తుంటే తమకు అడ్డుకోవడం అన్యాయమని అంగన్‌వాడీ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు.

హామీలు అమలు చేయాలి


పోలవరం: ఏటిగట్టు సెంటర్‌లో అంగన్‌వాడీల మానవహారం

పోలవరం రూరల్: అంగన్‌వాడీలు సుదీర్ఘంగా పోరాడి సాధించిన సమ్మె కాలపు డిమాండ్లను పరిష్కరించాలని సీఐటీయూ మండల కార్యదర్శి పీఎల్ఎస్ కుమారి, సీపీఎం మండల కార్యదర్శి కారం భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల నిర్బంధాన్ని ఖండిస్తూ సోమవారం స్థానిక ఏటిగట్టు సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేసి నిరసన తెలిపారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం అంగన్‌వాడీ సమస్యలను పరిష్కరించకుంటే పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. అరెస్ట్ చేసిన నాయకులు అంగన్‌వాడీలను తక్షణమే విడుదల చేయాలనీ డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ నాయకులు సాయిలక్ష్మి, పద్మ, ఉమా, సత్యవాణి, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి సముద్రాల సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ సంఘాల ఆందోళన


ఐటీడీఏ వద్ద ఆదివాసీ సంఘాల నేతల ఆందోళన

బుట్టాయగూడెం: ఎస్టీ ఉద్యోగులను వేధిస్తున్న అధికారులపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని కోరుతూ ఆదివాసీ ఐక్య కార్యాచరణ కమిటీ, ఆదివాసీ సంక్షేమ పరిషత్, ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం కేఆర్‌పురం ఐటీడీఏ వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ ఐక్య కార్యాచరణ కమిటీ చైర్మన్ మొడియం శ్రీనివాసరావు మాట్లాడుతూ ఐటీడీఏ పరిధిలో పనిచేస్తున్న ఒక ప్రధానోపాధ్యాయురాలు నకిలీ పత్రాల ద్వారా ఉద్యోగం పొందిందని ఆరోపణలు వచ్చినప్పటికీ ఆ ఉపాధ్యాయురాలిపై అధికారులు విచారణ నివేదిక తొక్కిపట్టి ఆమెపై చర్యలు తీసుకోకుండా కాపాడారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ జేఏసీ ప్రధాన కార్యదర్శి సోదెం ముక్కయ్య, ఏఎస్పీ డివిజన్ కార్యదర్శి తెల్లం లక్ష్మణరావు, ఆదివాసీ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఫీజు పోరును విజయవంతం చేయాలి


కొయ్యలగూడెం: ఫీజు పోరు పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు


కామవరపుకోట: ఫీజుపోరు గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న కంభం విజయరాజు, పార్టీ శ్రేణులు

కొయ్యలగూడెం: వైఎస్సార్‌సీపీ చేపట్టిన ఫీజు పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పోలవరం మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు సోమవారం పిలుపు ఇచ్చారు. కొయ్యలగూడెంలో ఫీజు పోరుకు సంబంధించిన పోస్టర్స్‌ను ఆయన పార్టీ శ్రేణులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 12వ తేదీ వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు జిల్లా కేంద్రాల్లో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థుల పక్షాన అండగా నిలుస్తూ కూటమి సర్కారుపై నిరసన గళం వినిపించాల్సిన బాధ్యత మనపై ఉందని అన్నారు. సూపర్ సిక్స్ పథకాలు ఫ్లాప్ కావడంతో ప్రజల దృష్టిని మరల్చేందుకు కూటమి ప్రభుత్వం అక్రమ అరెస్టులకు దిగజారిందని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం 12వ తేదీ కూడా కావడంతో ఆ రోజున మండల కేంద్రాల్లో ముందుగా పార్టీ ఆవిర్భావ వేడుకలు నిర్వహించి అనంతరం ఏలూరులో జరగనున్న ఫీజుపోరుకు హాజరు కావాల్సిందిగా పార్టీ శ్రేణులకు, ప్రజాప్రతినిధులకు సూచించారు. ఎంపీపీ గంజిమాల రామారావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు మేకల అన్నవరం, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ తాడిగడప రామకృష్ణ, పట్టణ కన్వీనర్ సంకుకొండ, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ చిక్కాల దుర్గాప్రసాద్, పార్టీ నాయకులు తోట జయబాబు, మారిశెట్టి శ్రీను, గంటా రమేష్, దూలపల్లి కాంతారావు, ఎస్‌కే బాజీ, చిడిపి రవి, ఏలేటి చంద్రం, తొంటా వాసు, తగరం ఆశీర్వాదం, సున్నం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

యువత పోరుకు తరలిరండి

కామవరపుకోట: ఈ నెల 12వ తేదీన వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో జరగనున్న యువత పోరుకు ప్రతి ఒక్కరూ తరలిరావాలని వైఎస్సార్‌సీపీ చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ఆర్అండ్‌బీ బంగ్లా ఆవరణలో ఫీజు పోరు గోడ పత్రికను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యా వ్యవస్థను, నిరుద్యోగులను గాలికి వదిలేసిందని, ఎన్నికల హామీలను నెరవేర్చకుండా మాయ మాటలతో ప్రజలను మోసం చేస్తు పబ్బం గడుపుతోందని విమర్శించారు. ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక కార్యకలాపాలను ఎండగట్టేందుకు ఈనెల 12న ఏలూరు కలెక్టరేట్ వద్ద నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమానికి ప్రతి ఒక్కరు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రామకృష్ణ, అంగన్‌వాడీ వింగ్ జిల్లా అధ్యక్షులు సాయిల స్వాతి, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు కాంతారావు, ప్రచార కమిటీ అధ్యక్షుడు మేరుగు బాబురావు, మద్దిపట్ల శ్రీనివాసరావు, వామిశెట్టి హరిబాబు, మేడంకి బుజ్జి, నిట్టా రోహిత్ పాల్గొన్నారు.

పట్టణ అభివృద్ధికే ప్రాధాన్యం

జంగారెడ్డిగూడెం: పట్టణ అభివృద్ధే ప్రాధాన్యతగా మున్సిపల్ కౌన్సిల్ పనిచేస్తోందని మున్సిపల్ చైర్ పర్సన్ బత్తిన లక్ష్మి అన్నారు. సోమవారం స్థానిక 10వ వార్డులో మున్సిపల్ సాధారణ నిధులు రూ.10 లక్షలతో సీసీ రోడ్ నిర్మాణ పనులను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.వెంకటరమణ, మున్సిపల్ ఏఈ రాజేష్, స్థానిక 10, 11, 26వ వార్డు కౌన్సిలర్లు తెలగరపు జ్యోతి, ఉగ్గం దుర్గాప్రసాద్, అచ్యుతరామయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు బత్తిన చిన్న, నెట్రూ గణేష్, నాయకులు తెలగారపు హనుమంతు, తెలగారపు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

నిరసనకు తరలివెళ్లిన హిందువులు

జంగారెడ్డిగూడెం: రాయచోటిలో ఉత్సవ ఊరేగింపులో హిందువులపై దాడి చేసి అక్రమ కేసులు బనాయించడాన్ని నిరసిస్తూ విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం ఏలూరులో నిర్వహించిన నిరసన కార్యక్రమానికి ఏజెన్సీ ప్రాంతం నుంచి హిందువులు తరలి వెళ్లినట్లు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చాత్రాతి ప్రసాదు తెలిపారు. కూటమి ప్రభుత్వంలో ఉండి హిందువులపై దాడి జరిగినా పట్టించుకోకపోవడంపై నిరసన తెలిపేందుకు హిందువులు భారీగా తరలి వెళ్లారన్నారు.

ఏజెన్సీలోని భూ సమస్యలు పరిష్కరించాలి


ఆర్డీవో కార్యాలయం వద్ద సీపీఎం నేతల ధర్నా

జంగారెడ్డిగూడెం: ఏజెన్సీలోని భూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఆర్డీవో కార్యాలయం వద్ద సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించారు. ఈమేరకు ఆర్డీవో ఆర్‌వీ రమణకు వినతిపత్రం అందజేశారు. అనంతరం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టి.రామకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ మర్లగూడెం, ఇనుమూరు, జైనవారిగూడెం, సిరివారిగూడెం గ్రామాల పరిధిలో 150 ఎకరాలకు పైగా ఎల్‌టీఆర్ భూములు ఉన్నాయని, వాటిని 25 ఏళ్లగా గిరిజనులు సాగు చేస్తున్నారన్నారు. ఈ భూములకు సంబంధించి అధికారులు, పోలీసులతో పాటు స్థానిక ఎమ్మెల్యే సైతం భూస్వాముల వైపు మాట్లాడుతున్నారన్నారు. దీని వల్ల ఏళ్ల తరబడి సాగులో ఉన్న గిరిజనులకు అన్యాయం జరుగుతోందన్నారు. సీపీఎం రాష్ట్రకమిటీ సభ్యురాలు మొడియం నాగమణి మాట్లాడుతూ బుట్టాయిగూడెంలోని ఇళ్లస్థలాలకి సర్వేచేసి ప్రభుత్వ భూమి గిరిజనులకు అప్పచెప్పమని అధికారులను ఆదేశించినప్పటికీ కనీసం ఇప్పటివరకు బుట్టాయిగూడెం తహసీల్దార్ కనీసం అటువైపు చూడటం లేదన్నారు. ఏజెన్సీ భూసమస్యలు, ఇళ్ల స్థలాలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించకపోతే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు తెల్లం దుర్గారావు, ఎం.జీవరత్నం, పోలోజు నాగేశ్వరరావు, జి.సూర్యకిరణ్, అందుగుల ప్రభాకర్, చుంద్రు బుల్లెమ్మ, గిరిజన జ్యోతి నాయకులు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఫారెస్ట్ గార్డ్ కార్యాలయం నుంచి వెదురు తడికలు మాయం


కొండపల్లి ఫారెస్ట్ గార్డ్ కార్యాలయం నుంచి రాత్రివేళ తడికలను తరలిస్తున్న దృశ్యం

కుక్కునూరు: అటవీ శాఖాధికారులు పట్టుకున్న వెదురు తడికలను రాత్రికి రాత్రే కొందరు గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తుండగా స్థానికులు పట్టుకుని అటవీశాఖ సిబ్బందికి అప్పగించారు. వివరాల్లోకి వెళితే, అమరవరం అటవీరేంజ్ పరిధిలోని బర్లమడుగు గ్రామంలో ఇటీవల అటవీశాఖకు చెందిన జిల్లా అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఎటువంటి అనుమతులు లేకుండా వెదురు బొంగులను నరికి తడికలను తయారు చేసి అమ్ముతుండగా జిల్లా అధికారులు పట్టుకుని తడికలను కొండపల్లి ఫారెస్ట్ గార్డ్ కార్యాలయం తరలించారు. కాగా వాటిని ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో కొందరు గుట్టుచప్పుడు కాకుండా తరలించుకు వెళ్తుండగా స్థానికులు చూసి అటవీశాఖ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి వారిని అడ్డుకున్నారు. కాని అప్పటికే కొన్ని తడికలను తరలించుకెళ్లినట్టు సమాచారం. తడికల తరలింపులో గతంలో అటవీశాఖలో టెంపరరీగా విధులు నిర్వహించిన వ్యక్తి కీలకంగా వ్యవహరించాడన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కాగా అమరవరం రేంజ్ పరిధిలో పలు ఘటనలు జరుగుతున్నా సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం


బాధిత మహిళలకు ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: తిరుమలంపాలెంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన శ్రీ సీతారామాంజనేయ ఫిషర్‌మెన్ సొసైటీ సభ్యులు మాండ్రు సుబ్బారావు, ఈపిచర్ల సుబ్బారావు కుటుంబాలకు సొసైటీ నుంచి సోమవారం రాత్రి ఆర్థిక సహాయాన్ని అందించారు. సొసైటీ అధ్యక్షుడు బంటుమిల్లి బాలకృష్ణ, డైరెక్టర్లు, సభ్యులు ముందుగా బాధిత కుటుంబాల ఇళ్లకు వెళ్లి వారిని పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం ఒక్కో కుటుంబానికి రూ.5 వేలు చొప్పున అందించారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు బాలకృష్ణ మాట్లాడుతూ మృతి చెందిన మత్స్యకార కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని, అలాగే మత్స్యకారుల కోసం సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షుడు మల్లిబోయిన వెంకటేశ్వరరావు, కార్యదర్శి మాండ్రు వెంకటేశ్వరరావు తదితరులున్నారు.

సంతాపం

టి నరసాపురం: టీటీడీ ఆస్థాన విద్వాంసుడు గరిమెళ్ళ బాలకృష్ణ ప్రసాద్ మృతికి ఏపీ ప్రజానాట్య మండలి సబ్ కమిటీ కన్వీనర్ టీబీఎస్ రాజు, సీనియర్ బుర్రకథ కళాకారుడు సబ్బి కనకారావు ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. టీటీడీ ఆస్థాన విద్వాంసునిగా సుదీర్ఘకాలం బాలకృష్ణ ప్రసాద్ సేవలందించారన్నారు.

సావిత్రీబాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలి


జంగారెడ్డిగూడెం: కొత్తబస్టాండ్ వద్ద సావిత్రీబాయి పూలే విగ్రహాన్ని ఆవిష్కరించిన మున్సిపల్ చైర్‌పర్సన్


చింతలపూడి: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సావిత్రీబాయి పూలే వర్ధంతి నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: స్త్రీ విద్యకు విశేష కృషిచేసిన మహానీయురాలు సావిత్రీబాయిపూలే అని, ఆమెను మహిళలు ఆదర్శంగా తీసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అన్నారు. పట్టణంలోని కొత్తబస్టాండ్ వద్ద సావిత్రీబాయి పూలే వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా నిర్మించిన సావిత్రీబాయి పూలే విగ్రహాన్ని చైర్ పర్సన్ ఆవిష్కరించి, పూలమాల వేసి నివాళులు అర్పించారు. బత్తిన లక్ష్మి మాట్లాడుతూ మాట్లాడుతూ 140 సంవత్సరాల క్రితం స్త్రీకి విద్య అర్హత లేని కాలంలో అమె సావిత్రీబాయి పూలే చదువుకుని 18 పాఠశాలలు, 7 అనాధ శరణాలయాలు స్థాపించిన మహానీయురాలు అని అన్నారు. దేశంలో ప్రథమ మహిళ ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే అని కొనియాడారు. కౌన్సిలర్ పీపీఎస్ చంద్రరావు, బత్తిన చిన్న మాట్లాడుతూ పూలే జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో అలుగు ఆనంద శేఖర్, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మల్లవరపు సత్యనారాయణ, కొండపల్లి కేశుబాబు, తల్లాడ నేతాజీ, పెడసనగంటి త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

స్త్రీలోకానికి ఆదర్శం

చింతలపూడి: మహిళల్లో స్ఫూర్తి నింపిన సావిత్రీబాయి పూలే జీవితం నేటి స్త్రీ లోకానికి ఆదర్శనీయమని పలువురు అన్నారు. సావిత్రీబాయి పూలే వర్ధంతి సందర్భంగా సోమవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆమె చిత్రపటానికి ప్రిన్సిపాల్ పి శ్రీనివాసరావు, అధ్యాపకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ సావిత్రీబాయి పూలే దేశంలో తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా ఎన్నో ఒడిదుడుకులను, విమర్శలను ఎదుర్కొని మహిళలకు చదువు నేర్పారని కొనియాడారు. కుల వ్యవస్థను నిర్మూలించడానికి భర్త జ్యోతీరావ్ పూలేతో కలిసి పోరాటాలు చేశారని అన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎన్‌జేకే నరేంద్రకుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఏ వెంకటేశ్వరరావు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ సయ్యద్ మీర్ హసీం, మ్యాథమెటిక్స్ హెచ్ ఓడీ డాక్టర్ దేవానందం, అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు కార్యక్రమానికి హాజరయ్యారు.

భారతరత్న అందించాలి

కొయ్యలగూడెం: తల్లికి వందనం పథకానికి ప్రభుత్వం సావిత్రీబాయి పూలే పేరు పెట్టాలని బీసీ చైతన్య సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెలగల దుర్గారావు పేర్కొన్నారు. సోమవారం సావిత్రీబాయి పూలే వర్ధంతి కార్యక్రమం బీసీ కమ్యూనిటీ హాల్ వద్ద నిర్వహించారు. అణగారిన వర్గాల ప్రజలకు విద్యను నేర్పిన మహోన్నత మహిళ అని కొనియాడారు. పూలే దంపతులకు భారతరత్న పురస్కారాలు ప్రదానం చేయాలని డిమాండ్ చేశారు. సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మద్దిబోయిన శ్రీనివాస్, తాడిగడప ఆంజనేయరాజు, పంది శ్రీను, శేఖర్, గంగాధర్, రాజు, సూరి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

జంగారెడ్డిగూడెం: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలయ్యాయి. పట్టణంలోని రామచంద్రాపురానికి చెందిన పాకనాటి దుర్గారావు, పొలం పనులు ముగించుకుని తన మోపెడ్‌పై ఇంటికి వస్తుండగా వాటర్‌ట్యాంక్ వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న మోటార్‌సైకిల్ ఢీకొంది. గాయపడిన దుర్గారావును స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి, అనంతరం రాజమండ్రిలోని ప్రైవేట్ ఆసుపత్రికి కుటుంబ సభ్యులు తరలించారు. కుమారుడు వెంకటేశ్వరరావు ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ ఎస్.ఉమామహేశ్వరరావు తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: వ్యక్తి అదృశ్యంపై భార్య ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై వై.మంగయ్య తెలిపారు. జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన షేక్ రెహమాన్ షరీఫ్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. జనవరి 31వ తేదీ మధ్యాహ్నం పనికి వెళుతున్నట్లు చెప్పి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. ఇప్పటివరకు వెతికినా అతని ఆచూకీ లభించకపోవడంతో సోమవారం భార్య అర్షి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

భోగోలు ఎయిడెడ్ పాఠశాలకు 4 స్టార్ రేటింగ్

లింగపాలెం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పాఠశాలల స్టార్ రేటింగ్ విధానంలో భోగోలు ఐసీఎం ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాల 4 స్టార్ రేటింగ్ సాధించిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు అబ్బూరి విక్టర్ బోస్ తెలిపారు. అందరి సహకారంతో ఈ రేటింగ్ సాధించగలిగినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు జి.కేథరీన్, ఐసీఎం పాఠశాల కరస్పాండెంట్ రోజీజాన్ తదితరులు హెచ్‌ఎంకు అభినందనలు తెలిపారు.

సైన్స్‌డే ప్రతి కళాశాలలో నిర్వహించాలి

జంగారెడ్డిగూడెం: నేషనల్ సైన్స్‌డే ప్రతి కళాశాలలో నిర్వహించాలని ఇస్రో సైన్స్ విశ్రాంత పరిశోధకుడు ఎల్లా శివప్రసాద్ అన్నారు. స్థానిక సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆయన అతిథి ఉపన్యాసం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డా. ఎస్.ప్రసాద్‌బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో శివప్రసాద్ మాట్లాడుతూ భారత్ స్వశక్తితో అంతరిక్షానికి సంబంధించి అనేక పరిశోధనలు నిర్వహిస్తోందని అవన్నీ నేడు సత్ఫలితాలు ఇస్తున్నాయని తెలిపారు.

మద్యం షాపులో చోరీపై కేసు నమోదు

టి.నరసాపురం: మద్యం షాపులో చోరీపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జయబాబు తెలిపారు. ఈ నెల 9వ తేదీ రాత్రి స్థానిక శ్రీశ్రీనివాస వైన్స్ షాపు తాళాలు పగులగొట్టి చోరీ చేశారని, షాపులోని 6 మద్యం సీసాలు, కొంత నగదు, సీసీ కెమేరాలకు సంబంధించి డీవీఆర్ చోరీకి గురయ్యాయని గుమస్తా లోకేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.